స్కెచ్

# వాత్సల్యం

ఆర్. యం. చిదంబరం

గోపాలం ముఖం వివర్ణమైంది. పై యధికారి చీవాట్లు అతని యభిమానాన్నంతా పైకి లేవదీసి అతనిలో ఉద్రేకతను కలిగించాయి. పై యధికారిని ఎదిరించి తన కోపాన్నంతా వెళ్ళగక్కుదామనుకున్నాడు. కాని ఎన్ని బాధలు పెట్టినా ఎన్ని కష్టాలు వచ్చినా నవ్వుతూఉండే భార్యయొక్క చిక్కిపోయిన సుందరవదనం, అతని నా ప్రయత్నంనుండి విరమింపజేసింది. ఒకవైపు దరిద్రబాధ. మరొకవైపు మానసిక బాధ. అన్నీ కలిసి అతన్ని అధఃపాతాళానికి త్రుంగదీస్తున్నాయి.

"అశోకుడు ధర్మప్రభువు. అత నెవరిని బాధింపలేదు. తన ప్రజలను తన కుమారులుగా భావించువాడు."

బాబు తన పాఠాన్ని చదువుకుపోతున్నాడు. అతని అమాయక వదనాన్ని చూచి సంతోషింపవలసిన గోపాలం వీపుమీద చెళ్లునొకటి వేశాడు. బాబు బిత్తరపోయి ఏడుపు లంకించుకున్నాడు. కళ్ల వెంట నీరు కారుతోంది.

"రోజూ పాఠం చదవకపోతే కొడతావు. ఇవేళ చదివినా కొడతావెందుకు నాన్నా?" అనడిగాడు అమాయకంగా.

"అస్తమానం వాడిని కొడతారెందుకండీ? కుర్రవాళ్ళను అందరూ ముద్దుగా పెంచుతారు. మీ శత్రువునల్లే చూస్తారేం బాబును?" అనడిగింది జానకి. గోపాల మామెకు సమాధానం చెప్పలేదు.

"పోరా దరిద్ర వెధవా! ఫో..." అని అరిచాడు బాబునిచూచి. బాబు ఇంట్లోకి పరుగెత్తాడు.

పిల్లలంటే గోపాలానికి ఎందుకయిష్టమో జానకి కర్థంకాలేదు. లోకంలో తండ్రికి సహజంగా కుమారుడిమీద అపారప్రేమ ఉంటుంది. కాని ఈ తండ్రికి కొడుకును చూస్తే అరికాలిమంట నెత్తికెక్కుతోంది. గోపాలం మనస్తత్వాన్ని జానకి అర్థం చేసుకోలేక పోయింది.

బాబుకు జబ్బు చేస్తే జానకి పడే అవస్థ ఆ భగవంతునికే తెలియాలి. గోపాలం అతని వంకైనా చూడడు. జానకే అతన్ని వెయ్యి కళ్ళతో కనిపెట్టుకుంటుంది. ఇవన్నీ తలచుకుంటే జానకికి దుఃఖం కట్టలు తెగి ప్రవహిస్తుంది.

బాబు అమాయకంగా సమస్తమూ మరచి నిద్రాదేవి ఒడిలో ఉన్నాడు. గోపాలానికి కూడా నిద్రాదేవి కటాక్షం కలిగింది.

అదెవరో గోపాలానికి తెలియలేదు. ముఖంలో దివ్యకాంతి మెరిసిపోతోంది. ప్రశాంతమైన కళ్ళల్లోంచి క్షీరతరంగాలు బయలుదేరుతున్నాయి. అతన్ని తనివి తీర చూచాడు గోపాలం. కాని చిత్రం! అతనికెదురుగా కళ్ళమ్మట నీరు కారుస్తూ బాబు నిలబడున్నాడు. బాబు ప్రారంభించాడు.

"ఏముంది? బాల్య జీవితం ఆనంద శిఖరం వంటిదని అంటారు. దానినే అనేక విధాల వర్ణిస్తారు. బాల్య జీవితం వసంత ఋతువు వంటిదని అంటారు. కాని ఏమిటో! అంతా మాయగా కనిపిస్తోంది!"

"అలాగంటావేం నాయనా! బాలలు దైవంతో సమానం. తెలుసా? అందుకే బాలవాక్యం బ్రహ్మవాక్యం అన్నారు" ఆ తేజోమూర్తినుండి కమ్మటి స్వరంలో ఈ మాటలు వెలువడ్డాయి.

"అదంతా బూటకం. నమ్మటానికి వీల్లేని మాటలు. నా బాల్య జీవితం నరకంలా ఉంది. అమ్మ, నాన్న అస్తమానం "చదువు, చదువు" అని చంపుకు తింటారు. హాయిగా ప్రకృతి సౌందర్యాన్ని, ఆకాశంలో మిలమిలమని మెరిసే ఆ చుక్కల్ని, వాట్లతో దోబూచులాడే చందమామను చూస్తూ గంతులేస్తూ ఉండాలి కాని ఇప్పటినుండి చదువెందుకు? పెద్దవాడనయ్యాక ఎలాగా చదువుకోవాలిగా. ఇప్పటినుండి నాకీ యాతనెందుకు? అయిష్ట

మయినా చదవక తప్పుతుందా అని చదువుతున్నా. ఈ వేళ ఏం జరిగిందో తెలుసా? చదువుతున్నా కూడా నాన్న కొట్టాడు. ఎందుకు కొట్టావంటే కసిరి పొమ్మన్నాడు. వీళ్ళందరికీ కొట్టటానికి నే నొక ఆట బొమ్మనై పోయాను. తిరగబడి కొట్టటానికి నాకు శక్తి లేదు. ఏం చేస్తాను? నోరు మూసుకొని నాన్న ఏమన్నా పడి ఉండవలసిందే."

ఆ తేజోమూర్తి తెలి మల్లెపూల చిరునవ్వు నవ్వాడెందుకో.

"అంతేకాదు. నాకు సుఖమనేది కనిపించటంలేదు. అమ్మ నాన్న దెబ్బలాడుకుని నన్ను కొడతారు. నేనంటే నాన్నకు ఎంత కోపమనుకున్నావు? నమిలిమింగేద్దామన్నంత కోపం. మా ఎదురింటి రమణారావు ఎంచక్కటి దుస్తులు వేసుకుని తిరుగుతాడు. ఆ సిల్కు బట్టలు చూస్తుంటే నాకు నిజంగా అసూయగా ఉంది. నాన్న అలాంటిదొక్కటైనా కొనివ్వడు. నాన్న మాత్రం సిల్కు బట్టలు వేసుకుని తిరుగుతాడు. ఆ రమణారావు బలే బిస్కత్తులు కొనితింటాడు. అణాకో బిస్కట్టట. నాన్న నాకొకసారైనా అలాంటి బిస్కట్లు కొనిపెట్టలేదు. అదెంత కమ్మగా వుంటుందనుకున్నావు? తింటే మళ్ళీ దాని రుచి మరచిపోం."

"అమాయకుడివోయి" అన్నాడు తేజోమూర్తి.

"అవును. అమాయకుడిని గనుక నే ఇన్ని అవస్థలూ సహించి ఊరుకుంటున్నాను. గడుసరి అయితే వీళ్ళందర్నీ ఎదిరించి తగిన బుద్ధి చెప్పి ఉండేవాడు. అంతేకాదు. సినిమాలకు నాన్న ఒక్కడే పోతాడు. ఓనాడు అమ్మకూడ వస్తానంది. నాన్న ఆకాశమంత ఎత్తున లేచి అమ్మను కొట్టినంత పనిచేసి ఆ వేళ అన్నం తినకుండా నిద్రపోయాడు. అమ్మకూడా ఆవేళ అన్నం తినలేదు. నాకూ రుచించలేదు. ఆవేళ నుండి అమ్మ సినిమాలకు పోదు. నన్నసలే తీసికెళ్ళడు. నేను పెద్దవాడి నైపోయానట. నాకు టిక్కట్టు కొనాలట. తన దగ్గర డబ్బులు లేవట. నేను నిజంగా పెద్దవాడినైయుంటే నాన్నను పట్టుకుని తన్నేవాడిని. మొన్న నేదో సినిమా వస్తే రమణారావు వెళ్ళాడు. అందులో పులులు, సింహాలు, ఏనుగులు, ఇంకా ఇంకా బలేబలే జంతువు లొచ్చాయట. మరి నన్నెవరు తీసికెడతారు?"

తేజోమూర్తి నవ్వి "మరి మీయమ్మ మంచిదేనా?" అనడిగాడు.

"మా అమ్మ చాలా మంచిది. తనైనా తినకుండా నాకు బువ్వ పెడుతుంది. నాకోసం ఎప్పుడూ కష్టపడుతుంది. మా అమ్మవంటిది ప్రపంచంలో మరెక్కడా లేదు" ఈసారి బాబు ముఖంలో ఏదో వింత జ్యోతిని గోపాలం చూచాడు.

"అమ్మోయ్! బాబోయ్! అమ్మోయ్!"

బాబు అరుపువిని నిద్రనుండి త్రుళ్ళిపడి లేచాడు గోపాలం.

"ఏమిటండి? ఏమైంది?" అనడిగాడు గాభరాగా. జానకి దీపం వెలిగించింది. చుట్టూ చూచింది. పెద్ద తేలొకటి తోకమడిచి పరుగెడుతోంది. ఇదే బాబును కుట్టిందన్న మాట. జానకి గుండె గతుక్కుమంది. బాబు తెగ అరిచేస్తున్నాడు.

"వీరయ్య తాతను తీసుకొస్తాను" అని జానకి పోబోయింది.

"వద్దు జానకీ! నేనే తీసుకొస్తాను" గోపాలం పరుగెత్తాడు. జానకి ఆశ్చర్యచకితురాలయింది. బాబంటే అసహ్యపడే గోపాలమిలా మారిపోటానికి కారణం ఆమె కర్థం కాలేదు.

ఐదు నిమిషాల్లో వీరయ్య తాతతో వచ్చాడు. గోపాలం. వీరయ్య తాత మంత్రం వేస్తున్నాడు. "చెయ్యి గట్టిగా జాడించు నాయనా" అంటున్నాడు. బాబు ఏడుస్తున్నాడు.

"ఏడవకు బాబూ! నీకు మంచి బిస్కత్తులు—ఆ రమణారావు కొనేలాంటి బిస్కత్తులు కొని పెడతాను. సిల్కు బట్టలు కొంటాను. సినిమాలకు తీసికెడతాను. నీ యిష్టం వచ్చినప్పుడు చదువుకో. ఏడవకు బాబూ! నిమిషంలో తగ్గిపోతుంది" అన్నాడు గోపాలం. బాబు ఆశ్చర్యంలో తండ్రి ముఖంలోకి చూచాడు బాధను మరచిపోయి. "జానకీ! ఈ ఇంట్లో తేళ్లు జెర్రెలూ చాలా ఎక్కువ. మంచి యింట్లోకి మారిపోదాం. చూడు మన బాబు ఎంత అవస్థ పడుతున్నాడో!" జానకి అలాగే చూస్తోంది.